TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 సంచిక: 117 హైదరాబాద్ శనివారం 17-10-2026 పేజీలు: 08



## ఓటర్ల తొలగింపుపై ప్రచారం అవాస్తవం

- భారీగా ఓట్ల తొలగింపుపై సీఈవో ఖండన
- ఫారాలు అందిన వారి పేర్లే ముసాయిదా జాబితాలో
- ఫారాలు అందని వారికి క్లెయిమ్‌లు, అభ్యంతరాల అవకాశం
- కొత్త ఓటర్లు, యువతకు నమోదు చేసుకునే అవకాశం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబితాలో చోటు



2

## డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలి

- పాలమూరు రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
- పథకాన్ని రద్దు చేయకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తాం
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్ మార్పుపై డీకే అరుణ అభ్యంతరం
- పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్
- కేసీఆర్ పదేళ్ల పాలనలో ఆర్డీఎస్‌కు చేసిందేమీ లేదని విమర్శ
- రైతుల ప్రయోజనాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపాటు



## సింగరేణి కార్మికులు చనిపోతే పట్టించుకోని కేసీఆర్!

- కేసీఆర్, కేటీఆర్‌లపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు
- సింగరేణి గనులను ఎప్పుడైనా పరిశీలించారా? అంటూ ప్రశ్న
- కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపణ
- కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని జీవన్‌రెడ్డి గతంలో ఆరోపించలేదా?
- కేసీఆర్, రేవంత్ పాలనకు ఇదే తేడా అంటూ వ్యాఖ్యలు

2

## నిరసనలతో వ్యాపారాలకు భారీ నష్టం!

- రూ.2,000 కోట్ల నష్టం.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఢిల్లీ వర్తక సంఘాలు
- కన్నాట్ ప్లేస్‌లో ఒక్కరోజు నిరసనతో రూ.200 కోట్ల వ్యాపారానికి గండి
- పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారాలు మూతపడితే చిరు వ్యాపారులకు ఇబ్బందులేనని కోర్టు ఆందోళన
- నిరసనల హక్కుతో పాటు వ్యాపారుల ప్రయోజనాలనూ కాపాడాలని విజ్ఞప్తి
- వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసనలకు ప్రత్యేక ప్రదేశాలు కేటాయించాలని డిమాండ్
- తక్షణ ఉత్తర్వులకు నిరాకరణ.. అక్టోబర్ చివరి వారానికి విచారణ వాయిదా



2

## ఎస్ఐఆర్‌తో ఓటు హక్కు తొలగించే ప్రయత్నం

- పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- హైదరాబాద్ జంట నగరాల పట్టభద్రులకు మంత్రి విజ్ఞప్తి
- ఓటు నమోదు ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం
- ఉద్యోగులు, న్యాయవాదులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హైదరాబాద్ జంట నగరాల పరిధిలోని పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని





## రైతులను త్యాగం చేయమంటారా?

- కరువుపై నిర్లక్ష్యం.. ఢిల్లీలో ప్రజాస్వామ్య ఉపన్యాసాలా?
- రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వానికి పట్టదా?
- ఎల్‌నినోపై ముందస్తు సమాచారం ఉన్నా చర్యలేవీ?
- జర్నలిస్టులు, ఆదివాసీలపై దాడులు చేస్తూ స్వేచ్ఛ మాటలా?
- రేవంత్ ప్రెస్‌మీట్‌లో కనిపించిన నిస్సహాయత
- గత ప్రభుత్వంపై విమర్శలే తప్ప.. ప్రజలకు భరోసా ఏది?
- కరువు కష్టాలపై సీఎం వైఖరిని తప్పుబట్టిన ఎమ్మెల్సీ కవిత
- ఆర్నెల్లకు మేల్కొన్న ప్రభుత్వం.. కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని రైతులు, ప్రజలు అల్లాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ చుట్టూ తిరుగుతూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అంటూ ఉపన్యాసాలు ఇస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇక్కడ జర్నలిస్టులు, ఆదివాసీలపై దాడులు చేయిస్తూ స్వేచ్ఛ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎల్ నినో వస్తుందని పది నెలల ముందే సమాచారం ఉన్నప్పుడు ప్రభుత్వం ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. "దొంగలు పడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టు" ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిన్నటి సీఎం ప్రెస్ మీట్‌లో ఆయన నిస్సహాయత స్పష్టంగా కనిపించిందని, గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప

మిగతా 2 లో..

## కార్ల తయారీ పరిశ్రమలకు తెలంగాణ అనువైన వేదిక

- పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం
- హ్యుందాయ్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణలో అనుకూల వాతావరణం
- రవాణా సదుపాయాలు.. హైదరాబాద్‌కు ప్రధాన బలం
- తయారీ రంగం అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం
- జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.8,528 కోట్లతో పరిశోధన, అభివృద్ధి కేంద్రం
- ప్రాజెక్టుతో 4,276 ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- 678 ఎకరాల్లో దశలవారీగా ప్రాజెక్టు అభివృద్ధి



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కార్ల తయారీ పరిశ్రమ స్థాపనకు తెలంగాణ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రతినిధి బృందానికి తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది.

**పెట్టుబడులకు అనుకూల వాతావరణం**

తెలంగాణ భౌగోళికంగా దేశం మధ్యలో ఉండటం, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చెందడం రాష్ట్రానికి అనుకూల అంశాలని రేవంత్‌రెడ్డి వివరించారు. హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, సురక్షితమైన నివాస ప్రాంతంగా గుర్తింపు పొందిందని తెలిపారు. రహదారులు, విమాన, రైల్వే మార్గాల ద్వారా బలమైన రవాణా సదుపాయాలు ఉండటం

మిగతా 2 లో..

## సింగరేణి స్కామ్‌పై కేటీఆర్ సవాల్..

- సింగరేణి వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- విదేశీ బొగ్గు కొనుగోళ్లలో కమిషన్ల దందా ఉందని ఆరోపణ
- రేవంత్‌ను 'ఈఎంఐ ముఖ్యమంత్రి' అంటూ కేటీఆర్ విమర్శలు
- నీటి ఎద్దడికి ప్రభుత్వమే కారణమంటూ ధ్వజం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సింగరేణిలో జరిగిన అక్రమాలు, కుంభకోణాలపై తాము నిలదీస్తే రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మీడియా ముందు ఆరోపణలు చేయడం కాదని, దమ్ముంటే సింగరేణి కుంభకోణాలు, ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. కేవలం బొగ్గు అంశమే కాకుండా, సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10 వేల కోట్ల కుంభకోణంతో పాటు సోలార్ పవర్ స్కామ్‌పై కూడా సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**విదేశీ బొగ్గు కుట్ర వెనుక కమిషన్ల దందా**

తెలంగాణలో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సింగరేణిని పక్కన పెట్టి, విదేశాల నుంచి బొగ్గు దిగుమతి

మిగతా 2లో..



## ఢిల్లీలో సీజేపీ నేతల అరెస్టుతో ఉద్రిక్తత

- అభిజిత్ దీప్కే సహా పలువురు నేతలు పోలీసుల అదుపులోకి
- సెంట్రల్ పార్క్‌లో జాతీయ జెండా ఎగురవేతకు పార్టీ పిలుపు
- ఓటర్ల జాబితా సవరణలో లోపాలున్నాయంటూ ఆరోపణలు
- నేతల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించిన పార్టీ వర్గాలు
- కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో భారీగా పోలీసుల మోహరింపు
- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రత కట్టుదిట్టం



ఢిల్లీ, (ప్రజాక్షేత్రం):

సీజేపీ నేతల ముందస్తు నిర్బంధం దేశ రాజధానిలో రాజకీయ ఉద్రిక్తతకు దారితీసింది. కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేతో పాటు పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను పార్టీ వర్గాలు తీవ్రంగా

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో అర్ధరాత్రి నాకాబందీ.. 48 మంది అదుపులోకి

- 'ఆపరేషన్ కవచ్'లో 3 వేల మంది పోలీసులతో విస్తృత తనిఖీలు
- నగరవ్యాప్తంగా 100కుపైగా బృందాలతో తనిఖీలు
- 725 వాహనాలు స్వాధీనం.. ఐదు మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు
- ఒక ఆయుధం స్వాధీనం.. రెండు గంజాయి కేసులు నమోదు
- గోల్కొండ జోన్‌లో అత్యధికంగా 213 వాహనాలు స్వాధీనం
- నంబర్ ప్లేట్లు తారుమారు చేస్తే క్రిమినల్ కేసులు: సీపీ సజ్జనార్



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

నగరంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. 'ఆపరేషన్ కవచ్' పేరుతో గురువారం అర్ధరాత్రి విస్తృతంగా నాకాబందీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 48 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ తెలిపారు. నగరవ్యాప్తంగా

మిగతా 2లో..

## రాహుల్ గాంధీ దాదాగిరి చేస్తున్నారా?

- కేంద్ర ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకోవడంపై కిషన్‌రెడ్డి ఆగ్రహం
- దమ్ముంటే ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ అగ్రనేతకు సవాల్
- ఓట్ చోరీ జరగలేదని స్పష్టం చేసిన కేంద్ర మంత్రి
- అజిత్ ధోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం సరికాదని హితవు
- రాజకీయ లబ్ధి కోసం ప్రముఖులను వివాదాల్లోకి లాగొద్దని వ్యాఖ్య



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. రాహుల్ గాంధీ దేశంలో దాదాగిరి చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వదిలిపెట్టబోమని రాహుల్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారా గెలిచి చూపించాలని సవాల్ విసిరారు.

**ఓట్ చోరీ జరగలేదు**

దేశంలో ఓట్ చోరీ జరగలేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. చోరులకు ప్రజలు ఎప్పుడూ ఓట్లు వేయరని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో సంబంధం లేకుండానే గతంలో బీజేపీ ఘన విజయాలు సాధించిందని

మిగతా 2లో..

# సింగరేణి స్కామ్‌పై కేటీఆర్ సవాల్..

మొదటిపేజీ తరువాయి

చేసుకోవడానికి రేవంత్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా టన్ను బొగ్గు రూ. 3,800కి దొరికితే, ఆస్ట్రేలియా తదితర విదేశాల నుంచి కొనుగోలు చేస్తే రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు ధర పడుతుందని, అక్కడ వచ్చే కమీషన్ల కోసమే ఈ విదేశీ కొనుగోళ్ల డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ హయాంలో సింగరేణి అండతోనే రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమైందని, కానీ నేడు రేవంత్ రెడ్డి ఆ సంస్థను బదనామ్ చేస్తూ సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'ఈఎంఐ' ముఖ్యమంత్రి.. రికవరీ ఏజెంట్లుగా ఏఐసీసీ పెద్దలు**

సీఎం రేవంత్ రెడ్డిని 'ఈఎంఐ ముఖ్యమంత్రి' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని హైకమాండ్‌కు ప్రతి నెలా ఈఎంఐ కట్టకుంటే ఆయన పదవి గల్లంతవుతుందని, అందుకే సింగరేణిని అడ్డంపెట్టుకుని స్కామ్‌లు చేసి ముడుపులు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రాష్ట్రంలో ఒక రికవరీ ఏజెంట్ లాగా వ్యవహరిస్తూ, రేవంత్ నుంచి కమిషన్లు వసూలు చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు విద్యుత్ కొనుగోళ్ల పేరుతో ఛత్తీస్‌గఢ్ ఒప్పందాలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. తాము గతంలో రూ. 3.90 కే యూనిట్ కొంటే కుంభకోణమన్న కాంగ్రెస్ నేతలు, నేడు రూ. 15 పెట్టి కొనాలని చూస్తున్న తీరును ఏమనాలని ప్రశ్నించారు.

**ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు**

రాష్ట్రంలో నెలకొన్న తాగు, సాగునీటి ఎద్దడిపై స్పందిస్తూ.. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని కేటీఆర్ విమర్శించారు. ఆరు నెలల ముందే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోయాలని తాము విజ్ఞప్తి చేసినా, తాను చేసిన తప్పులు బయటపడతాయనే భయంతో రేవంత్ ఆ పని చేయలేదని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీళ్లు ఎత్తకపోవడంతో వృథాగా పోయాయని, నేడు పంటలు ఎండిపోతుంటే 'ఎల్‌నినో' పేరుతో చేతులెత్తేస్తున్నారని దుయ్యబట్టారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జలపండగ చేసుకుంటూ 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం దాకా నీళ్లు తరలించుకుంటుంటే, కేవలం 70 కిలోమీటర్ల దూరంలోని మహబూబ్‌నగర్‌కు కూడా నీళ్లు ఇచ్చుకోలేని చేతకాని స్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, రాజకీయాలు పక్కన పెట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రాహుల్ గాంధీ దాదాగిరి చేస్తున్నారా?

మొదటిపేజీ తరువాయి

గుర్తుచేశారు. ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు.

**ధోవల్‌ను రాజకీయాల్లోకి లాగొద్దు**

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌ను రాజకీయ వివాదాల్లోకి లాగడాన్ని కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. దేశ యువత హృదయాల్లో ధోవల్‌కు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఆయన పేరు వింటేనే పాకిస్థాన్ గుండెల్లో రైళ్లు పరిగెడతాయని వ్యాఖ్యానించారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో కీలక పాత్ర పోషించే వ్యక్తులను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం తగదని అభిప్రాయపడ్డారు.

**కాంగ్రెస్ తీరుపై విమర్శలు**

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రముఖులను వివాదాల్లోకి లాగడం కాంగ్రెస్ పార్టీకి తగదని కిషన్‌రెడ్డి హితవు పలికారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఎస్ఐఆర్‌తో ఓటు హక్కు తొలగించే ప్రయత్నం

మొదటిపేజీ తరువాయి



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

**ఓటు నమోదుతో ప్రజాస్వామ్య పరిరక్షణ**

హైదరాబాద్ జంట నగరాల్లోని 15 నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. పట్టభద్రుల ఓటరు నమోదు, ఎన్నికల వ్యూహంపై చర్చించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

**పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి**

ఉద్యోగులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు.

# సింగరేణి కార్మికులు చనిపోతే పట్టించుకోని కేసీఆర్!

- **కేసీఆర్, కేటీఆర్‌లపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు**
- **సింగరేణి గనులను ఎప్పుడైనా పరిశీలించారా? అంటూ ప్రశ్న**
- **కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపణ**
- **కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని జీవన్‌రెడ్డి గతంలో ఆరోపించలేదా?**
- **కేసీఆర్, రేవంత్ పాలనకు ఇదే తేడా అంటూ వ్యాఖ్యలు**

జగిత్యాల, (ప్రజాక్షేత్రం):

సింగరేణి సంస్థ, కార్మికుల సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికులు చనిపోయినా కేసీఆర్ పట్టించుకోలేదని ఆరోపించారు. పదేళ్ల పాలనలో ఒక్క సింగరేణి గనినైనా పరిశీలించారా? అంటూ కేసీఆర్, కేటీఆర్‌లను ప్రశ్నించారు.

**కేటీఆర్ తీరుపై విమర్శలు**

సింగరేణికి గడ్డం పెంచుకుని వస్తే ఏం లాభమని కేటీఆర్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రశ్నించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడం, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవడమే ముఖ్యమని వ్యాఖ్యానించారు. కార్మికుల సమస్యలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.

**జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ..**

కేసీఆర్‌పై జగిత్యాల మాజీ ఎమ్మెల్యే టి. జీవన్‌రెడ్డి చేసిన గత విమర్శలను మంత్రి ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని జీవన్‌రెడ్డి గతంలో ఆరోపించలేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను దెయ్యం, భూతం అంటూ జీవన్‌రెడ్డి విమర్శించారని గుర్తుచేశారు.

**కేసీఆర్, రేవంత్ పాలనకు తేడా**

గతంలో హోంమంత్రిని కేసీఆర్ గేటు బయటే నిలిపివేశారని అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలను తనతోపాటు విమానంలో పక్కన కూర్చోబెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధుల పట్ల వ్యవహరించే తీరులో కేసీఆర్, రేవంత్‌రెడ్డికి మధ్య ఇదే తేడా అని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, సంస్థ నిర్వహణపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కార్ల తయారీ పరిశ్రమలకు తెలంగాణ అనువైన వేదిక

మొదటిపేజీ తరువాయి

పారిశ్రామిక పెట్టుబడులకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధి, భవిష్యత్తులో ఓడరేవులతో వేగవంతమైన రవాణా అనుసంధానం వంటి ప్రణాళికలు పారిశ్రామిక రంగానికి మరింత ప్రయోజనం చేకూరుస్తాయని చెప్పారు. ప్రణాళికాబద్ధమైన ప్రాంతీయ అభివృద్ధి నమూనాల ద్వారా తయారీ రంగాన్ని విస్తరించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు.

**జహీరాబాద్‌లో రూ.8,528 కోట్ల పెట్టుబడి**

జహీరాబాద్‌లోని జాతీయ పెట్టుబడులు, తయారీ మండలి (నిమ్జ్)లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ సమగ్ర అంతర్జాతీయ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

ఈ కేంద్రం కోసం రూ.8,528 కోట్ల పెట్టుబడి పెట్టాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 678 ఎకరాల్లో దశలవారీగా ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా 4,276 ఉద్యోగాలు కల్పించాలని సంస్థ నిర్దేశించుకుంది. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న కొన్ని నెలల్లో కేంద్రానికి శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

**పెట్టుబడుల ఆకర్షణకు వరుస చర్యలు**

2024లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో సమావేశమైంది. అనంతరం, 2025 జూన్‌లో సంస్థ ప్రతిపాదించిన పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది.

తెలంగాణలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని రేవంత్‌రెడ్డి వివరించారు. 2026లో నిర్వహించనున్న తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొనాలని హ్యుందాయ్ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించారు.

**ఇంజినీరింగ్ సామర్థ్యాల విస్తరణ**

తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తామని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఉన్న హ్యుందాయ్ కేంద్రం ఇప్పటికే అధునాతన వాహన ఇంజినీరింగ్ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేస్తోంది.

జహీరాబాద్ నిమ్జ్‌లో ఏర్పాటు చేయనున్న పరిశోధన, అభివృద్ధి కేంద్రం, భారీ వాహన పరీక్షా కేంద్రం వాహనాల పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదలలో కీలక పాత్ర పోషించనున్నాయి.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో సీజేపీ నేతల అరెస్టుతో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

ఖండించాయి.

**నిరసనకు పార్టీ పిలుపు**

నేతల అరెస్టులకు నిరసనగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఉన్న సెంట్రల్ పార్క్ వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని సీజేపీ శ్రేణులు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పార్క్ పరిసర ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

**ఎన్నికల కమిషనర్ తీరుపై అభ్యంతరాలు**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిని సీజేపీ తప్పుబట్టింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ పార్టీ ఆందోళనలకు సిద్ధమైంది. ఈ అంశాలపై నిరసన చేపట్టాలని నిర్ణయించినట్లు కథనంలో పేర్కొన్నారు.

**కన్నాట్ ప్లేస్‌లో కట్టుదిట్టమైన భద్రత**

సెంట్రల్ పార్క్ వద్ద జాతీయ జెండా ఎగురవేతకు పార్టీ పిలుపునివ్వడంతో పోలీసులు భద్రతను పెంచారు. పరిసర ప్రాంతాల్లో బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నిరసన కార్యక్రమం సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టారు. సీజేపీ నేతల నిర్బంధం, ఎన్నికల కమిషనర్ తీరుపై విమర్శలు, ఓటర్ల జాబితా సవరణలో లోపాలున్నాయన్న ఆరోపణలతో ఢిల్లీలో ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలి

- **పాలమూరు రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు**
- **పథకాన్ని రద్దు చేయకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తాం**
- **పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్ మార్పుపై డీకే అరుణ అభ్యంతరం**
- **పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్**
- **కేసీఆర్ పదేళ్ల పాలనలో ఆర్డీఎస్‌కు చేసిందేమీ లేదని విమర్శ**
- **రైతుల ప్రయోజనాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపాటు**

మహబూబ్‌నగర్, (ప్రజాక్షేత్రం):

డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేపడతామని బీజేపీ ఎంపీ డీకే అరుణ హెచ్చరించారు. పాలమూరు రైతులకు అన్యాయం చేస్తూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని డిండికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. జిల్లా ప్రజలకు మేలు చేయలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవిలో ఎందుకు ఉండాలని ప్రశ్నించారు.

**డిజైన్ మార్పుతో రైతులకు నష్టం**

పాలమూరు-రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో డిజైన్ మార్పుల వల్ల జిల్లాకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా నీటిని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు.

**పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి**

పాలమూరు జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు.

**కేసీఆర్‌పైనా విమర్శలు**

గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ఆర్డీఎస్ ప్రాజెక్టు అభివృద్ధికి చేసిందేమీ లేదని డీకే అరుణ విమర్శించారు. పాలమూరు ప్రాంత సాగునీటి సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. పాలమూరు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రైతులను త్యాగం చేయమంటారా?

మొదటిపేజీ తరువాయి




ప్రజా సంక్షేమం కోసం ఆయన చెప్పిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

**రైతులను త్యాగాలు చేయమనడం కాదు.. మీ పదవులను త్యాగం చేస్తారా?**

ఒక్క సీజన్ వరి పంట వేయవద్దని, రైతులు త్యాగం చేయాలని సీఎం చెప్పడంపై కవిత మండిపడ్డారు. రైతులను త్యాగం చేయమని అడుగుతున్న రేవంత్ రెడ్డి, ముందుగా తన కాంగ్రెస్ నాయకులను పదవులు త్యాగం చేయాలని అడగగలరా అని ప్రశ్నించారు. నీళ్లు కొనుగోలు చేసేవి కావని పదే పదే చెప్పిన్న సీఎం, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి నీటిని ఎందుకు అందుబాటులోకి తేలేదని నిలదీశారు. కనీసం తన సొంత జిల్లాలోని ప్రాజెక్టులను కూడా పూర్తి చేసుకోలేని స్థితిలో రేవంత్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు మూడు నెలల ముందే కరువుపై స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తే, ఈ ప్రభుత్వం మాత్రం కాలం చెల్లిన తర్వాత సీతక్క నేతృత్వంలో కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మిషన్ భగీరథను పక్కన పెట్టారు.. చెరువులను మాయం చేశారు**

కేసీఆర్ హయాంలో ఇంటింటికీ తాగునీరందించిన 'మిషన్ భగీరథ' పథకాన్ని కనీసం నిర్వహణ (మేంటెనెన్స్) చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని, వెంటనే దానిని వినియోగంలోకి తెచ్చి నగరాల్లో, గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని కవిత డిమాండ్ చేశారు. మేడిగడ్డపై నివేదిక వచ్చిందని, దానిని కూల్చివేసి కడతారా లేదా ఎప్పుడు పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ నగరంలో వాటర్ కష్టాలకు ముఖ్యమంత్రి అనుచరులే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిటీలో 8 వేల చెరువులు మాయమయ్యాయని కాగ్ రిపోర్టు వచ్చిందని, ఈ విషయంలో హైడ్రా ఏం చేస్తోందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కరువులో ఉన్న రైతులు, కూలీలకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు పంటలకు ఇన్స్యూరెన్స్ కల్పించాలని కోరారు.

**ప్రైవేటీకరణ కుట్రలు.. కేటీఆర్ సభలపై కవిత ఘాటు వ్యాఖ్యలు**

విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కొన్ని విభాగాలను ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారో చెప్పాలని కవిత నిలదీశారు. అలాగే పార్టీ అంతర్గత విషయాలు, కేటీఆర్ వైఖరిపై కూడా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు, పార్టీకి ప్రతిమా శ్రీనివాస్ ఎన్నో విధాలుగా తోడుగా ఉన్నారని, అలాంటి వ్యక్తిపైనే కేటీఆర్ లేఖ రాయడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. నమ్ముకున్న వాళ్లను కేటీఆర్ ముంచుతాడని తనకు తెలుసని, విచారణ చేయాలని కేటీఆర్ లేఖ రాస్తే సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రతిమా శ్రీనివాస్‌ను కాపాడే ప్రయత్నం చేశారన్నారు. ఇక సింగరేణి సభలో కేటీఆర్ కార్మికుల సమస్యల కంటే రాజకీయాలే ఎక్కువ మాట్లాడారని, ఆయనకు కార్మికుల కష్టాలు తెలియవని వ్యాఖ్యానించారు. అది సింగరేణి కార్మికుల కోసం పెట్టిన సభ కాదని, కేవలం బలప్రదర్శన, 'షో ఆఫ్' కోసం కేటీఆర్ పెట్టుకున్న సొంత సభ అని కవిత ఆరోపించారు.

# హైదరాబాద్‌లో అర్ధరాత్రి నాకాబందీ.. 48 మంది అదుపులోకి

మొదటిపేజీ తరువాయి

100కుపైగా బృందాలతో, సుమారు 3 వేల మంది పోలీసులతో తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.

**725 వాహనాలు స్వాధీనం**

ఆపరేషన్ కవచ్‌లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 725 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సజ్జనార్ వివరించారు. వాహనాల పత్రాలు, ఇతర వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపిన ఘటనలకు సంబంధించి ఐదు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఒక ఆయుధాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు, గంజాయికి సంబంధించిన రెండు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**గోల్కొండ జోన్‌లో అత్యధికం**

జోన్‌ల వారీగా చూస్తే గోల్కొండ పరిధిలో సరైన పత్రాలు లేని 213 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ జోన్‌లో 18 వాహనాలను డిటైన్ చేశారు. అదే ప్రాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు.

**నంబర్ ప్లేట్లపై హెచ్చరిక**

వాహనదారులు నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. నంబర్ ప్లేట్లను తారుమారు చేయడం, వాటిని స్పష్టంగా కనిపించకుండా ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి వాహనంపై నంబర్ ప్లేట్ స్పష్టంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. నగరంలో నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ నిబంధనల అమలును లక్ష్యంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసు శాఖ వెల్లడించింది.

# నిరసనలతో వ్యాపారాలకు భారీ నష్టం!

- **రూ.2,000 కోట్ల నష్టం.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఢిల్లీ వర్తక సంఘాలు**
- **కన్నాట్ ప్లేస్‌లో ఒక్కరోజు నిరసనతో రూ.200 కోట్ల వ్యాపారానికి గండి**
- **పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారాలు మూతపడితే చిరు వ్యాపారులకు ఇబ్బందులేనని కోర్టు ఆందోళన**
- **నిరసనల హక్కుతో పాటు వ్యాపారుల ప్రయోజనాలనూ కాపాడాలని విజ్ఞప్తి**
- **వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసనలకు ప్రత్యేక ప్రదేశాలు కేటాయించాలని డిమాండ్**
- **తక్షణ ఉత్తర్వులకు నిరాకరణ.. అక్టోబర్ చివరి వారానికి విచారణ వాయిదా**

ఢిల్లీ, (ప్రజాక్షేత్రం):

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల కారణంగా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వర్తక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అక్టోబర్ 10 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.2,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. వ్యాపారాలకు అక్రమంగా అంతరాయం కలిగితే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. అయితే, తక్షణ ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించి, తదుపరి విచారణను అక్టోబర్ చివరి వారానికి వాయిదా వేసింది.

**నిరసనలతో వ్యాపారాలకు నష్టం**

సీజేపీ తలపెట్టిన నిరసనల నేపథ్యంలో న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్డీఎంసీ) సెంట్రల్ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ తన పిటిషన్‌లో పేర్కొంది. నిరసనల వల్ల వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని, ముఖ్యంగా ప్రధాన మార్కెట్లలో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపింది.

**చిరు వ్యాపారుల జీవనోపాధిపై ఆందోళన**

పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారాలు మూతపడితే చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, హమాలీల జీవనోపాధి దెబ్బతింటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. వ్యాపారాలకు అక్రమంగా అంతరాయం కలిగితే న్యాయస్థానం జోక్యం చేసుకుంటుందని పేర్కొన్న ధర్మాసనం.. ఈ దశలో తక్షణ ఆదేశాలు ఇవ్వడానికి మాత్రం అంగీకరించలేదు.

**వర్తక సంఘాల మూడు ప్రధాన డిమాండ్లు**

వ్యాపార కార్యకలాపాలకు ఆటంకాలు లేకుండా చూడాలని వర్తక సంఘాలు కోర్టును కోరాయి. అక్టోబర్ 2026 నుంచి జనవరి 2027 వరకు ప్రధాన మార్కెట్లలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసనల కోసం ప్రత్యేక ప్రదేశాలు కేటాయించాలని, నిరసన తెలిపే హక్కుతో పాటు వ్యాపారుల హక్కులనూ సమతుల్యం చేసేలా ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) రూపొందించాలని డిమాండ్ చేశాయి.

**ప్రభుత్వమే కారణమంటున్న సీజేపీ వ్యవస్థాపకుడు**

మరోవైపు, వర్తకుల ఆందోళనలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. శాంతియుత నిరసనల వల్ల వ్యాపారాలకు నష్టం జరగదని, ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, రవాణాపై ఆంక్షలు విధించడం వల్లే నగరంలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని ఎక్స్ వేదికగా విమర్శించారు.

కన్నాట్ ప్లేస్‌లో ఒక్కరోజు నిరసన వల్ల సుమారు రూ.200 కోట్ల వ్యాపారం దెబ్బతింటోందని, అక్టోబర్ 10 నుంచి ఇప్పటివరకు రూ.2,000 కోట్ల నష్టం వాటిల్లిందని పిటిషనర్లు పేర్కొన్నారు. పండుగల సీజన్‌లో నిరసనలు, వ్యాపార కార్యకలాపాల మధ్య సమతుల్యం ఎలా సాధించాలన్న అంశం ఢిల్లీ వర్తక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఓటర్ల తొలగింపుపై ప్రచారం అవాస్తవం

- **భారీగా ఓట్ల తొలగింపుపై సీఈవో ఖండన**
- **ఫారాలు అందిన వారి పేర్లే ముసాయిదా జాబితాలో**
- **ఫారాలు అందని వారికి క్లెయిమ్‌లు, అభ్యంతరాల అవకాశం**
- **కొత్త ఓటర్లు, యువతకు నమోదు చేసుకునే అవకాశం**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబితాలో చోటు**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణలో భారీగా ఓటర్లను తొలగించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి ఖండించారు. ఓటర్ల తొలగింపుపై వస్తున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నుంచి ఫారాల సేకరణ ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నుంచి ఫారాలు సేకరించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటర్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఫారాలు సమర్పించేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. ఫారాలు అందిన వారి పేర్లను ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చినట్లు వెల్లడించారు. ఫారాలు అందని వారి పేర్లు ముసాయిదా జాబితాలో లేవని వివరించారు.

ఫారాలు అందని ఓటర్లకు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రక్రియను చేపట్టినట్లు సీఈవో తెలిపారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొత్త ఓటర్లు, యువ ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించినట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పిస్తామని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్లకు అవకాశం ఇవ్వకుండా పేర్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు.

# బ్యాతల శివశంకర్ కుటుంబానికి దాసరి నాగేష్ రూ.50 వేల ఆర్థిక సాయం

- మంద కృష్ణ మాదిగ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేత
- సేవా కార్యక్రమంలో ముందడుగు వేసిన దాసరి నాగేష్
- నాగేష్‌ను అభినందించిన మంద కృష్ణ మాదిగ.

**శంకర్ పల్లి, అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**





సామాజిక సేవలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. బ్యాతల శివశంకర్ మాదిగ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు దాసరి నాగేష్ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సహాయాన్ని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చేతుల మీదుగా అందజేశారు. మోకిల గ్రామానికి చెందిన నాగేష్ ఇంటికి వెళ్లి మంద కృష్ణ మాదిగ అభినందించారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారికి సహాయం చేయాలనే సంకల్పంతో దాసరి నాగేష్ ముందుకు వచ్చి రూ.50 వేల ఆర్థిక సాయం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో ఆర్థిక తోడ్పాటు అందించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షుడు లింగం సాయి మాదిగ, శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు కటికే మోహన్ శ్రీనివాస్ తదితరులు దాసరి నాగేష్‌ను అభినందించారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాధితుడికి ఆర్థిక సహాయం అందించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి తోడ్పాటు అందించే కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. బాధితులకు సహాయం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.



## జీపీ షాపులను కేటాయించిన వారే నడిపించుకోవాలి

- జీపీకి తక్కువ అద్దె చెల్లిస్తూ ఇతరులకు ఎక్కువ ధరకు అద్దెకు ఇవ్వటం సరికాదు
- గ్రామంలో వినాయక చవితి, ఎస్ఐఆర్ ప్రక్రియ,పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ, విజయవంతంగా నిర్వహించుకున్నాం
- సర్పంచ్ కల్లూరి సంధ్యా హనుమాన్లు

**పోతంగల్,అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

పోతంగల్ మండల కేంద్రంలో సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు అధ్యక్షతన జిపి సెక్రెటరీ ప్రతాప్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు.గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాలను గ్రామ సభలో సెక్రటరీ ప్రతాప్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్లూరి సంధ్యా హనుమాన్లు మాట్లాడుతూ ఇటీవల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనిర్వహించిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ, చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ , వెరిఫికేషన్, వినాయక చవితి పండుగ ఏర్పాట్లు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు విజయవంతం కావడానికి గ్రామ ప్రజలందరూ సహకరించారని అన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలన్నీ విజయవంతం అయ్యేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కొరత ఉందని సిబ్బంది ఖాళీల గురించి తీర్మానం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామసభలో నిర్ణయించినట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ పరిధిలో గల భూములు ,షాపుల అద్దెలను ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలని తీర్మానించినట్లు తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీకి చెందిన షాపులను కేటాయించిన వారు మాత్రమే షాపులు నడుపుకోవాలని ఇతరులకు ఇవ్వకూడదని తీర్మానించినట్లు తెలిపారు. గతంలో గ్రామపంచాయతీ నుండి తక్కువ ధరకు షాపులను పొందిన వారు ఇతరులకు ఎక్కువ ధరకు అద్దెకు ఇచ్చి కిరాయిలు తీసుకోవడం జరిగిందని అందువల్ల గ్రామ ప్రజల సూచన మేరకు షాపులు కేటాయించిన వారు మాత్రమే నడుపుపోవాలని అన్నారు. లేదంటే షాపులను గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు,ఉప సర్పంచ్ గులాం నబి,సెక్రటరీ ప్రతాప్,వార్డు మెంబర్లు,ఆయా శాఖల అధికారులు,గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి.

- దేశభక్తి నినాదాలతో తాండూరులో సైకిల్ ర్యాలీ.
- విద్యార్థుల్లో క్రమశిక్షణ, పోలీస్ శాఖపై గౌరవభావం, పెంపొందించడమే లక్ష్యం.
- జిల్లా అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా.

**తాండూరు,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ ఆధ్వర్యంలో తాండూరు డీఎస్పీ నార్సింగ్ యాదయ్య తో పాటు డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, తాండూరు పట్టణంలోని ఇంద్రాచౌక్ నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల సేవలను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలను విద్యార్థులకు వివరించడంతో పాటు, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, పోలీస్ శాఖ పట్ల గౌరవభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, అన్నారు, ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా సందేశాన్ని అందించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి భావనను పెంపొందించడంతో పాటు, పోలీస్ శాఖ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## దైవ కార్యానికి చేయూత... సేవామూర్తులకు ఘన సన్మానం

- ధ్వజస్తంభం సమర్పణ..... భక్తులకు అన్నదానం నిర్వహించిన కోహిర్ రాజు, కోహిర్ శ్రీనివాస్
- సేవాభావాన్ని అభినందించిన గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు
- ప్రముఖ వ్యాపారవేత్త,కోహిర్ క్లే ఇండస్ట్రీస్ అధినేత కోహిర్ రాజు, పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించిన పెద్దేముల్ గ్రామ ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు,ఆలయ కమిటీ సభ్యులు

**పెద్దేముల్,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించడంతో పాటు, ధ్వజస్తంభాన్ని సమర్పించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రముఖ వ్యాపారవేత్త, కోహిర్ క్లే ఇండస్ట్రీస్ అధినేత కోహిర్ రాజు, పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్‌లను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని వారి సేవాభావాన్ని అభినందించారు.శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా కోహిర్ రాజు, కోహిర్ శ్రీనివాస్‌లు ధ్వజస్తంభాన్ని సమర్పించడంతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భగవంతుడి సేవలో భాగస్వాములవుతూ, భక్తులకు అన్నప్రసాదాన్ని అందించడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాతలు అందించే సహకారం ఆలయాల అభివృద్ధికి, గ్రామంలో భక్తిభావం పెంపొందడానికి దోహదపడుతుందని అన్నారు.ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు , ఉపసర్పంచ్ డివై.ప్రసాద్‌లతో పాటు గ్రామ పెద్దలు కోహిర్ రాజు, కోహిర్ శ్రీనివాస్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు.శ్రీ ఆంజనేయ స్వామి వారి సేవలో ముందుకు వచ్చి ధ్వజస్తంభం సమర్పించడం,అన్నదానం నిర్వహించడం ద్వారా వారు భక్తి, సేవ, దాతృత్వానికి నిదర్శనంగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్.నరేందర్ రెడ్డి(దొర ),నల్లా నర్సిరెడ్డి, విద్యాసాగర్,కారోబార్ నర్సిరెడ్డి, పి.మోహన్ రెడ్డి,వడ్ల రాములు చారి,చిట్టెపు రాఘవేందర్ రెడ్డి,రంగారెడ్డి,వెంకట్ రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలు నివారించాలి..

- రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి

**వలిగొండ,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ మండల శాఖ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ళ సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోళ్ళ సుదర్శన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పంటలు పొట్ట దశలో ఉన్న సమయంలో సమయపాలన లేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే అప్రకటిత విద్యుత్ కోతలను నివారించి, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని కోరారు .ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంధారపు లింగస్వామి,రాచకొండ కృష్ణ, అశోక్ రెడ్డి,ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మంద నరసింహ, రాములు,బచ్చు శ్రీనివాస్, మైసొల్ల పెద్దమచ్చగిరి,ఆనందు, పద్మారెడ్డి,అనిల్,మండల పదాధికారులు రంజిత్ రెడ్డి, నాగరాజు,లోడే లింగస్వామి గౌడ్,దయాకర్,వెంకటేశం, యువ మోర్చా మండల అధ్యక్షుడు మైసొల్ల చిన్న మచ్చగిరి,మండల నాయకులు, బూత్ అధ్యక్షులు జంగయ్య, మురళి,రాజేశ్వర చారి,జనార్దన్ రెడ్డి, భాస్కర్ గౌడ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి చొరవ!

- ఎల్నినో ప్రభావం,నీటి ఎద్దడి నివారణపై సమీక్ష..
- ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలపై చర్చ

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం)**

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పరిధిలోని పిగ్లిపూర్ గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామంలో ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించారు.

**నీటి ఎద్దడి నివారణకు చర్యలు**

వాతావరణంపై ఎల్నినో ప్రభావం, రానున్న రోజుల్లో తలెత్తే నీటి కొరతను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమావేశంలో అవగాహన కల్పించారు. గ్రామంలో నీటి వనరుల సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు, ఇంకుడు గుంతల నిర్మాణం ప్రాధాన్యంపై చర్చించారు. జలసిరి పనుల పురోగతిని సమీక్షిస్తూ, నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష**

వీబీ జీ రామ్ జీ పథకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉపాధి హామీ పనులకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామస్థులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు, సంబంధిత శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ దుర్గం నరసింహ యాదవ్,వార్డు సభ్యులు జక్కుల శివ కుమార్,జక్కుల ఝాన్సీ-ఆంజనేయులు,వర్ధం లావణ్య-హనుమంతు,జక్కుల పరమేశ్ యాదవ్,పంది మురళీకృష్ణ,కొండ రమేష్ యాదవ్, కోలన్ హరిణి-మహేందర్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,ఉపాధి హామీ కూలీలు,రైతులు పాల్గొన్నారు. గ్రామ వాలంటీర్ సంస్థ ప్రతినిధులు,అంగన్‌వాడీ కార్యకర్తలు,రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని సంబంధిత అంశాలపై చర్చించారు.






## కోటగిరిలో ఘనంగా శత ఛండీ యాగం

- సార్వజనిక్ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు
- భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్న నవరాత్రి రజతోత్సవాలు

**కోటగిరి,అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ సార్వజనిక్ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 25వ. రజతోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం విఠలేశ్వర మందిరంలో శ్రీ శత ఛండీ యాగం ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులు నిర్వహించే శత ఛండీ యాగంలో మాజీ జెడ్పిటిసి పుప్పాల శంకర్ దంపతులు, మాజీ సర్పంచ్ బీర్కూరు గంగాధర్ దంపతులు, మాశెట్టి నర్సయ్య సేట్ దంపతులు, కాయపల్లి బుగ్గరాజు దంపతులతో పాటు వివిధ జంటలు పాల్గొని సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చిన దేవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెయ్యి మంది పిల్లలతో సరస్వతి దేవి రూపంలో ఉన్న దేవికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెన్నులు నోట్ బుక్కులను పంపిణీ చేశారు. 16వ తేదీన మహాలక్ష్మి రూపంలో 17న దుర్గ మాత దేవి రూపంలో అమ్మవారు దర్శనమిస్తుందని వారు అన్నారు. ఈ చండీయాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా శ్రీసార్వజనిక్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ 16, 17, 18 తేదీలలో మూడు రోజుల పాటు శ్రీ శత చండీయాగం నిర్వహిస్తూ ప్రతినిత్యం అమ్మవారు దీక్షపరులతో మండపం వద్ద ప్రత్యేక పూజలు,హారతులు ఘనంగా జరుపబడుతున్నాయన్నారు. అనంతరం విఠలేశ్వర్ ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని పత్తి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సార్వజనిక్ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులు కాపుగాండ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, భీమా సాయి రెడ్డి,విట్టల్,గోక శంకర్,దినేష్,రమేష్, సురేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మూడు గ్రామాల్లో ఆధునిక అంగన్వాడీ కేంద్రాలు

- బసంతి ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- పెద్దగూడెం తాండ, మంగంపల్లిలో అభివృద్ధి పనులు

**వనపర్తి,అక్టోబరు 16 (ప్రజాక్షేత్రం):**

జిల్లాలోని మూడు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు బసంతి ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తి మండలంలోని పెద్దగూడెం తాండ, పెద్దగూడెం గ్రామాల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునికీకరిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకుడు అజయ్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు.

**పిల్లలకు మెరుగైన వసతులు**

ప్రస్తుతం ఉన్న అంగన్వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టి, కొత్త కిటికీలు, తలుపులు, నేలపై పలకలు, ఆధునిక వంటగది, శీతలీకరణ యంత్రం, దృశ్యశ్రవణ పరికరం, పిల్లలకు ఆటవస్తువులు, వంటగది తోట తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు అజయ్ కలెక్టర్‌కు వివరించారు. పెద్దగూడెం తాండ, పెద్దగూడెంతో పాటు మంగంపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సైతం ఆధునికీకరించి అందించనున్నట్లు తెలిపారు.

**ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దాలి**

అంగన్వాడీ కేంద్రాలను అన్ని సౌకర్యాలతో ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. పిల్లల హాజరు శాతాన్ని ప్రస్తుత స్థాయి నుంచి రెట్టింపు చేసేలా అంగన్వాడీ కార్యకర్త, గ్రామ సర్పంచి సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి,ఎంపీడీవో, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# తండ్రి ఆలోచనలకు అక్షర రూపం.. 'డియర్ అక్షర'

- ఘనంగా డా. సి. కిరణ్‌కుమార్ పుస్తకావిష్కరణ

**వనపర్తి,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

సాహితీ కళా వేదిక, చింతకుంట పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో డా. సి. కిరణ్‌కుమార్ రచించిన 'డియర్ అక్షర' పుస్తకావిష్కరణ గురువారం రాత్రి స్థానిక సి.వి. రామన్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు, ప్రజా వైద్యశాల డైరెక్టర్ ఎల్. మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**సమాజాన్ని అర్థం చేసుకునేలా లేఖలు**

ఈ సందర్భంగా ఎల్. మురళీధర్ మాట్లాడుతూ.. ఒక తండ్రి తన కుమార్తెకు సమాజంలో నిత్యం ఎదురయ్యే వివిధ అంశాలను వివరిస్తూ, వాటిని అర్థం చేసుకుని సవాళ్లను అధిగమిస్తూ జీవితంలో ముందుకు సాగేందుకు మార్గనిర్దేశం చేసేలా ఈ పుస్తకంలోని లేఖలు ఉన్నాయని తెలిపారు. వంద అంశాలపై రాసిన ఈ లేఖలు తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడికి నాంది పలికేలా ఉన్నాయని పేర్కొన్నారు. సరళమైన భాష, చక్కని రచనా శైలితో పాఠకులను ఆకట్టుకునే విధంగా పుస్తకాన్ని రచించారని కొనియాడారు.

**కుమార్తెకు తండ్రి ఇచ్చే అమూల్యమైన కానుక**

పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ తండ్రి తన కుమార్తెకు అందించే అమూల్యమైన కానుకగా 'డియర్ అక్షర' పుస్తకాన్ని అభివర్ణించారు. ఇందులోని లేఖలు అన్ని కాలాలకు, వివిధ పరిస్థితులకు అన్వయించేలా ఉన్నాయని తెలిపారు. అనంతరం సాహితీ కళా వేదిక తరఫున రచయిత డా. సి. కిరణ్‌కుమార్‌ను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో జనజ్వాల,కోళ్ల వెంకటేష్,గంధం నాగరాజు, చిన్నమ్మ థామస్,సత్తార్ తదితరులు పుస్తకంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. బైరోజు చంద్రశేఖర్,బండారు శ్రీనివాస్,ఉప్పరి తిరుమలేశ్, కురుమూర్తి ,నవీన్‌రెడ్డి,సురేష్, సురేందర్,కవిత,భరత్ తదితరులు పాల్గొన్నారు.




# జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

- మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి
- అలంపూర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు

**వనపర్తి,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అలంపూర్‌లోని శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీ జోగులాంబ అమ్మవార్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు.

రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్‌కుమార్ మంత్రితో కలిసి పాల్గొన్నారు.

ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, కార్యనిర్వహణాధికారి దీప్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, శ్రీ జోగులాంబ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వేదమంత్రాల నడుమ స్వామివారి,అమ్మవారి ఆశీర్వచనాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి,వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్,తెలంగాణ రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, ఆలయ అధికారులు ,అదనపు కలెక్టర్లు,పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం

- 60 గజాల స్థలాల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం
- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్

**మొయినాబాద్, అక్టోబర్ 16(ప్రజా క్షేత్రం):**

హిమాయత్‌నగర్‌లో 60 గజాల స్థలాల సమస్యతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. వంద రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న బాధితుల సమస్యను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

శుక్రవారం బాధితులతో కలిసి రెవెన్యూ మంత్రిని కలిసిన భీం భరత్.. హిమాయత్‌నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 151లో 60 గజాల స్థలాలకు సంబంధించిన సమస్యను వివరించారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా బాధితులు కొనసాగిస్తున్న నిరాహార దీక్ష విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. బాధితుల సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి త్వరలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని భీం భరత్ తెలిపారు. ప్రభుత్వం బాధితుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. మంత్రి హామీతో బాధితులు నిరాహార దీక్ష విరమించారని తెలిపారు. వారి సమస్య పరిష్కారం అయ్యే వరకు అవసరమైన విధంగా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తామని భీం భరత్ పేర్కొన్నారు. బాధితులు ఆందోళన విరమించి ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని కోరారు.



# వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలి!

- ఉద్యాన పంటల యాజమాన్యంపై రైతులకు సూచనలు
- వికారాబాద్ జిల్లాలో 34 శాతం వర్షపాతం లోటు.. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

**వికారాబాద్ బ్యూరో,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంటల్లో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ,తెగుళ్లు,పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్ రైతులకు సూచించారు. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటల్లో నేల తేమను కాపాడుకోవాలని ఆయన కోరారు.

34 శాతం వర్షపాతం లోటు 2026 జూన్ 1 నుంచి అక్టోబర్ 14 వరకు వికారాబాద్ జిల్లాలో సాధారణ వర్షపాతం 715.9 మి.మీ. కాగా, వాస్తవంగా 474.9 మి.మీ. మాత్రమే నమోదైంది. దీంతో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 34 శాతం లోటు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో వర్షపాతం అవకాశాలు తక్కువగా ఉండటంతో రైతులు పంటల దశను బట్టి నీటి తడులు ఇవ్వాలని సూచించారు.

కూరగాయల సాగులో జాగ్రత్తలు పొడి వాతావరణ పరిస్థితుల్లో కూరగాయల పొలాల్లో కలుపు మొక్కలను తొలగించి నేలలో తేమను సంరక్షించుకోవాలి. పంట కీలక దశల్లో నీటి ఎద్దడి రాకుండా అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి. నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను అనుసరించాలి. బూడిద తెగులు లక్షణాలు కనిపిస్తే సంబంధిత పంటకు సిఫారసు చేసిన నివారణ చర్యలు చేపట్టాలి.

మిరపలో ఎండు కొమ్మ తెగులుపై నిఘా మిరప పంటలో తగినంత తేమ ఉండేలా డ్రిప్ ద్వారా నీటిని అందించాలి. కలుపు మొక్కలను తొలగించి గాలి ప్రసరణకు అనుకూలంగా ఉండేలా చూడాలి. ఎండు కొమ్మ తెగులు సోకిన కొమ్మలను తెగులు సోకిన భాగానికి దిగువన కత్తిరించి పొలం నుంచి తొలగించాలి. అవసరమైనప్పుడు వ్యవసాయ, ఉద్యాన శాఖల తాజా సిఫారసుల మేరకు శిలీంద్రనాశకాలను ఉపయోగించాలని సూచించారు.

పండ్ల తోటల్లో ప్రత్యేక యాజమాన్యం మామిడి తోటల్లో హాపర్ల నివారణకు సిఫారసు చేసిన చర్యలు చేపట్టాలి. పూత ప్రారంభమయ్యే వరకు నీటి తడులు నిలిపివేయాలని సూచించారు. జామ తోటల్లో క్యాంకర్ తెగులు సోకిన పండ్లు, ఎండిన కొమ్మలను సేకరించి నాశనం చేయాలి. పండ్ల ఈగ ఉనికిని గుర్తించేందుకు ఎకరానికి 8-10 మిథైల్ యూజినాల్ ఎర ట్రాప్‌లను ఏర్పాటు చేయాలి. నిమ్మ, బత్తాయి వంటి సిట్రస్ పంటల్లో క్యాంకర్ నివారణకు వర్షాలు ఆగిన తర్వాత సిఫారసు చేసిన మందులను సూచించిన మోతాదులో పిచికారీ చేయాలి.

పసుపు, అల్లంలోనూ అప్రమత్తత పొడి వాతావరణం కొనసాగితే నేల స్వభావం, పంట దశను బట్టి పసుపు పంటకు నీటి తడులు ఇవ్వాలి. పసుపులో మొవ్వు తొలిచే పురుగు, అల్లంలో ఆకు చుట్టు పురుగు లక్షణాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలి.

అధికారుల సూచనలు పాటించాలి వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని పంటలను తరచూ పరిశీలించాలని, తెగుళ్లు, పురుగుల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఎం.ఏ. సత్తార్ సూచించారు. పురుగుమందులు, శిలీంద్రనాశకాలను వినియోగించే ముందు పంటకు వర్తించే అధికారిక సిఫారసులు, మందుల లేబుల్‌పై పేర్కొన్న మోతాదులు,భద్రతా జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.



# పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్

- కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు
- ఎమ్మెల్యే జీఎంఆర్

**అడ్డాకుల,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని ఆయన విమర్శించారు. అడ్డాకుల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి, రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు సుమారు రూ.6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**పైరవీలకు తావులేకుండా సంక్షేమ పథకాలు**

పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పైరవీలకు తావులేకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నామని జీఎంఆర్ పేర్కొన్నారు. రేషన్ కార్డు ప్రతి పేద కుటుంబానికి ఎంతో ముఖ్యమని, అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రాథమిక ఆధారంగా ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు అందక పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కూడా పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని విమర్శించారు.

**ఏడాదికి రూ.13 వేల కోట్లతో సన్నబియ్యం**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.13 వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు.

**1000 రోజుల్లో అభివృద్ధి చేసి చూపించాం**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో చేసి చూపిస్తోందని జీఎంఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే లక్ష్యంతో వివిధ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు,మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు యువకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# నేడు పెద్దేముల్ సొసైటీ చైర్మన్‌గా నల్లా యెల్లారెడ్డి ప్రమాణ స్వీకారం

- రైతు సేవా సహకార సంఘం నూతన సారథిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నల్లా యెల్లారెడ్డి
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్
- ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు చేసిన పెద్దేముల్ సొసైటీ సిబ్బంది
- నల్లా యెల్లారెడ్డి బాధ్యతలతో రైతుల సంక్షేమం,సహకార సంఘం అభివృద్ధిపై కోటి ఆశలు

**పెద్దేముల్,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్ సీఎస్) నూతన చైర్మన్‌గా నల్లా యెల్లారెడ్డి నేడు (శనివారం ) ప్రమాణ స్వీకారం చేయనున్నారు.మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయం వద్ద ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే సర్వం సిద్ధం చేశారు.నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నల్లా యెల్లారెడ్డికి అభినందనలు తెలిపేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, రైతులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరుకానుండగా,జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొననున్నారు. సహకార సంఘం నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి,రైతుల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తమ ఆకాంక్షలను వ్యక్తం చేయనున్నారు.

**రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యం**

వ్యవసాయ రంగంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచడం, వ్యవసాయానికి సంబంధించిన అవసరాల్లో సహకారం అందించడం, సాగు సమయంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తోడ్పడటం వంటి అంశాల్లో ఎఫ్ఎసీఎస్‌ల సేవలు ఎంతో ముఖ్యమైనవి.ఈ నేపథ్యంలో నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నల్లా యెల్లారెడ్డి నాయకత్వంలో పెద్దేముల్ సహకార సంఘం రైతులకు మరింత చేరువ కావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సంబంధిత సేవలు అర్హులైన రైతులకు సక్రమంగా చేరేలా కృషి చేయడం, ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించడం, రైతులకు అవసరమైన సమయంలో సేవలు అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రైతుల సమస్యలను తెలుసుకుని,వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే సహకార సంఘంపై రైతుల్లో మరింత విశ్వాసం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సంఘ అభివృద్ధిపై స్థానిక రైతుల్లో ఆశలు**

సహకార సంఘం అభివృద్ధితో పాటు రైతులకు మెరుగైన సేవలు అందించడం నూతన చైర్మన్ ముందున్న ప్రధాన బాధ్యతగా నిలవనుంది. రైతుల అవసరాలను గుర్తించి,సంఘ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ,సభ్యుల ప్రయోజనాలకు పెద్దపీట వేయాలని రైతులు కోరుకుంటున్నారు. వ్యవసాయ సీజన్‌లో ఎరువుల లభ్యత, పంపిణీ విధానం, రైతులకు అందించే సేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా సంఘాన్ని ముందుకు నడిపిస్తూ, సహకార వ్యవస్థపై అన్నదాతలకు నమ్మకం కలిగించేలా నూతన చైర్మన్ నల్లా యెల్లారెడ్డి కృషి చేయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.నేడు జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం పెద్దేముల్ మండల సహకార రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంది.

**ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు**




పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం వద్ద నేడు (శనివారం) ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నాయకులు, రైతులు, సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.ఎమ్మెల్యే బయ్యని మనోహర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ హాజరు కానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన చైర్మన్‌గా నల్ల యెల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించే ఈ కార్యక్రమానికి రైతులు, సహకార సంఘం సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,పెద్దేముల్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ముస్లింలకు కేటాయించాలి

- వైస్ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలని మైనార్టీ ప్రజల విజ్ఞప్తి

**జహీరాబాద్,అక్టోబర్ 16 (ప్రజా క్షేత్రం):**

జహీరాబాద్ సీనియర్ కాంగ్రెస్ లీడర్ మహమ్మద్ ఆయుబ్,పట్టణంలో సుమారు 85 వేల మంది ముస్లిం జనాభా ఉన్న నేపథ్యంలో, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముస్లిం మైనార్టీ వర్గానికి కేటాయించాలని మైనార్టీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుతున్నారు. ఇప్పటివరకు వివిధ వర్గాలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కినందున, సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత నిస్తూ ఈసారి ముస్లిం మైనార్టీకి చైర్మన్ పదవి, బీసీ వర్గానికి వైస్ చైర్మన్ పదవి కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, మైనార్టీలు మరియు బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని మైనార్టీ ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా



కాంగ్రెస్ పార్టీ కి ఎప్పటి జహీరాబాద్ కానిస్టెన్సీ మైనార్టీ ప్రజలు అండగా నిల్వడం ఏం ఎల్ ఎలక్షన్స్ లో స్వల్ప మెజార్టీ తో వోడిపోవడం జరిగింది.అందుకు జహీరాబాద్ మైనార్టీ ప్రజలు. ఏం పి* ఎలక్షన్స్ లో తగిన ప్రాతినిధ్యం వహించి.ఏం పి నీ గెల్పించుకోవడం జరిగింది..

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేములకొండలో బతుకమ్మ సంబరాలు.

**వలిగొండ అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వేణు మాధవి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ అనురాధ హెచ్ ఈఓ సుదర్శన్ ఎల్ డి కంప్యూటర్ స్వామి ఫార్మసిస్ట్ సునీత స్టాఫ్ నర్స్ అనిత ల్యాబ్ టెక్నీషియన్ కొండలరావు ఆరోగ్య కార్యకర్తలు జి. సత్తయ్య ఆర్. సంధ్యారాణి ఎ. సాలమ్మ జే. వినోద వంశీ, సుశీల ఆశా కార్యకర్తలు కృష్ణవేణి, నీరజ, రమ, బోడ కవిత, సౌజన్య, పావని, సూర్యకాంతం, మారగోని సంతోష, రేష్మ, అరుణ, లక్ష్మి, జ్యోతి, కవిత, సుజాత, యాదమ్మ, ఎలిమినేటి సంతోష, తదితరులు పాల్గొన్నారు.







# గ్రామీణ క్రీడా ప్రతిభకు 'ఛాంపియన్స్ కప్' వేదిక!

- **15 మండలాలు.. ఏడు క్రీడాంశాలు.. హోరాహోరీ పోటీలు**
- **ప్రతిభ చాటితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు**
- **స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి**
- **క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపే లక్ష్యంగా సాగాలి:**
- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,అక్టోబరు 16 (ప్రజాక్షేత్రం):**

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వనపర్తి జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఛాంపియన్స్ కప్-2026 పోటీలు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా 15 మండలాలకు చెందిన క్రీడాకారులు ఏడు క్రీడాంశాల్లో తమ ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యారు.

దసరా పండుగ వేళ క్రీడా మైదానాలు సందడిగా మారాయి.

పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి.సునీతారెడ్డి పోటీలను ప్రారంభించారు.

ముందుగా హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, తాడు లాగుడు, క్యారమ్స్, చదరంగం పోటీలకు శ్రీకారం చుట్టారు.

**తాడులాగుడులో హోరాహోరీ..**
**చదరంగంలో ఎత్తుకు పైఎత్తు!**

ప్రారంభోత్సవంలో శివసేనారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తాడు లాగుడు పోటీలో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ప్రజాప్రతినిధుల బృందం, జిల్లా అధికారుల బృందంగా విడిపోయి పోటీపడగా ఇరువర్గాలు ఒక్కోసారి విజయం సాధించాయి.

అనంతరం కొత్తకోట, రేవల్లి మండలాల మధ్య క్రికెట్ పోటీని అతిథులు టాస్ వేసి ప్రారంభించారు.

ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న వాలీబాల్,ఫుట్‌బాల్, కబడ్డీ, క్యారమ్స్,చదరంగం పోటీలనూ ప్రారంభించారు. వనపర్తి-పానగల్ జట్ల మధ్య వాలీబాల్, పానగల్-చిన్నంబావి జట్ల మధ్య కబడ్డీ, అమరచింత-గోపాల్‌పేట జట్ల మధ్య ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. చదరంగంలో కలెక్టర్, శివసేనారెడ్డి ఎత్తుకు పైఎత్తులు వేస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్యారమ్స్‌లో ఎస్పీ డి.సునీతారెడ్డి తన ఆటతీరుతో ఆకట్టుకున్నారు.

**గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్రస్థాయి అవకాశాలు**

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ఛాంపియన్స్ కప్ వంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్హత, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని మండలాల క్రీడాకారులకు అవకాశం కల్పించేలా పోటీలను నిర్వహించాలన్న కలెక్టర్ ఆలోచనను అభినందించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ పోటీపడే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వనపర్తి జిల్లాలో ఈ పోటీల నిర్వహణను ఆదర్శంగా తీసుకుని సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసం కలుగుతుందని పేర్కొన్నారు.



**క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపే లక్ష్యంగా సాగాలి**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఛాంపియన్స్ కప్‌లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటుతూ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఏడు క్రీడాంశాల్లో అత్యధిక ట్రోఫీలు సాధించిన మండలానికి ఛాంపియన్స్ ట్రోఫీ అందజేస్తామని వెల్లడించారు. ఈ పోటీలు గ్రామీణ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపడంతోపాటు వారి ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆటలతో ఆరోగ్యం.. జట్టుగా సాగితే విజయం**

జిల్లా ఎస్పీ డి.సునీతారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, అయితే మైదానంలో నేర్చుకునే క్రమశిక్షణ, పరస్పర సహకారం, జట్టుగా పనిచేసే లక్షణాలు జీవితంలోనూ ఉపయోగపడతాయని అన్నారు. తోటి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సమష్టిగా ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మైదానాల్లో ఆటలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యం,శారీరక దృఢత్వం పెరుగుతాయని తెలిపారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.ఖీమ్యా నాయక్,ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు,కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,అధికారులు, క్రీడాకారులు,క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# లక్షలాది భక్తుల రాక.. కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **ఉద్దాల మహోత్సవానికి రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం.**
- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి**
- **ఎమ్మెల్యే జియంఆర్**

**మహబూబ్ నగర్ జిల్లా ,అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు నవంబర్ 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జియంఆర్) అధికారులను ఆదేశించారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జియంఆర్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు కురుమూర్తి స్వామి దర్శనానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా నవంబర్ 14న జరిగే అలంకారోత్సవం, నవంబర్ 16న జరిగే ఉద్దాల మహోత్సవానికి రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

**భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం**

భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని, చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్ వంటి ఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**భక్తులకు రవాణా సౌకర్యాలు**

మహాలక్ష్మి ఉచిత బస్సు పథకాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల రాకపోకలకు సరిపడా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు.

**రోడ్లు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి**

కురుమూర్తి స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారుల వెడల్పు, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని R&B అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**త్రాగునీటికి కొరత లేకుండా చర్యలు**

జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లు, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**పారిశుధ్యం, వైద్య సేవలు పటిష్టం చేయాలి**

ఆలయ పరిసరాలు, భక్తుల రాకపోకల మార్గాలు, కోనేరు, పార్కింగ్ ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్స్‌లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.



**అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తత**

ఉద్దాల ఉత్సవ ప్రాంగణం, తాత్కాలిక దుకాణాలు, వంటశాలలు తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్లు, అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**భక్తులను మోసం చేస్తే కఠిన చర్యలు**

జాతరలో ఏర్పాటు చేసే దుకాణాల్లో తూనికలు, కొలతల పరికరాలను అధికారులు తనిఖీ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ధృవీకరించిన తూనికలు, కొలతల పరికరాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకుని భక్తులకు ఎలాంటి మోసాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

**ఆహార నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ**

జాతరలో ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాల్లో పరిశుభ్రత పాటించేలా చూడాలని, భక్తులకు నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

**సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం**

వీఐపీల కంటే సామాన్య భక్తులకు ప్రాధాన్యత నిస్తూ స్వామివారి దర్శనం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే జియంఆర్ స్పష్టం చేశారు. ప్రతి భక్తుడికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం అధికారుల, ప్రజా ప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.

**మత్తు పదార్థాలపై ఉక్కుపాదం**

జాతర పరిసరాల్లో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలు, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జియంఆర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆలయ చైర్మన్,కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాజు నాయక్ చిన్నమ్మ సీతా బాయి మృతి

- **యాలాల మండల మాజీ జెడ్పీటిసి సభ్యులు సిద్రాల శ్రీనివాస్ పరామర్శ,**

**యాలాల,అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని బాణాపూర్ గ్రామంలో మండల బీ ఆర్ ఎస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు జెరుపుల రాజు నాయక్ చిన్నమ్మ సీత బాయ్ శుక్రవారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు గ్రామానికి వెళ్లి ఇంటికి చేరుకుని మృతదేయంపై పుష్పగుచ్ఛం ఉంచారు. నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు .పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కుర్వ వెంకటయ్య, హాజీపూర్ రవి, జక్కెపల్లి గణేష్ ముదిరాజ్ ,బీ. ఆర్. ఎస్. పార్టీ నాయకులు రాజు నాయక్, శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ గోపాల్,మాజీ సర్పంచ్ సాయిలు,బంటు మానయ్య, లక్ష్మణ్ నాయక్,బంటు కిష్టప్ప, శంకర్ నాయక్,మాణిక్య నాయక్,గోపాల్,రాజు నాయక్, తిరుపతి,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు

- **112 మంది మహిళలతో మహా కుంకుమార్చన**

**కోటగిరి,అక్టోబర్ 16,(ప్రజాక్షేత్రం):**

పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో శ్రీ శాంబావి దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సాయంత్రం 112 మంది ఆడపడుచులతో మహా కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.





# హమాలీల కష్టాలు పట్టించుకోండి- అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలి

- **ఎస్‌జీఎస్ కార్యదర్శి శ్రీనివాస్‌కు ఏఐటీయూసీ నేత కేతరాజు నరసింహ వినతి**

**రంగారెడ్డి,అక్టోబర్ 16 (ప్రజా క్షేత్రం):**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో హమాలీ కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారి జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని అన్‌లోడింగ్ చార్జీలను పెంచాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతరాజు నరసింహ కోరారు. ఈ మేరకు శుక్రవారం బాటసింగారం సమీపంలోని గడ్డి అన్నారం వ్యవసాయ ఫ్రూట్ మార్కెట్‌లో ఎస్‌జీఎస్ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కేతరాజు నరసింహ మాట్లాడుతూ.. మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు రోజంతా శ్రమిస్తున్నప్పటికీ, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆదాయం లేక కుటుంబ పోషణ భారంగా మారిందని వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాటు కుటుంబ ఖర్చులు అధికమవుతున్నాయని, ప్రస్తుత అన్‌లోడింగ్ చార్జీలు వారి అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు.

**రెండేళ్లకోసారి చార్జీల పెంపు అవసరం**

హమాలీ కార్మికుల అన్‌లోడింగ్ చార్జీలను ప్రతి రెండేళ్లకోసారి పెంచాల్సిన అవసరం ఉందని కేతరాజు నరసింహ తెలిపారు. కార్మికుల శ్రమను, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని చార్జీల పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎస్‌జీఎస్ కార్యదర్శి శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఫ్రూట్ మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ షరీఫ్,ప్రధాన కార్యదర్శి కోయకూర చిన్న గౌడ్, కోశాధికారి మేతరి పోచయ్య,ఉపాధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కొంపల్లిలో ఏఐఆర్ హెల్త్ హబ్ ప్రారంభం

- **ఆహారం నుంచి ఆరోగ్యం వరకు.. అంతా ఒకేచోట**

**కుత్బుల్లాపూర్,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

ఆరోగ్య సంరక్షణను ఆసుపత్రులకే పరిమితం చేయకుండా.. నిత్యజీవితంలో భాగం చేయాలనే లక్ష్యంతో కొంపల్లిలో ఏఐఆర్ ఎసెన్షియల్స్ అండ్ హెల్త్ హబ్ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ టాలీవుడ్ నటి నభా నటేశ్ శుక్రవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, తాజా పండ్లు, కూరగాయలు, వెల్‌నెస్ ఉత్పత్తులు, ఫార్మసీ సేవలు, ముందస్తు ఆరోగ్య పరీక్షలను ఒకే వేదికపై అందించడం ఈ హబ్ ప్రత్యేకత. వ్యవస్థాపకుడు కుమార్ స్వామి రెడ్డి మారూరి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కేంద్రం 'ఆహారమే ఔషధం' అనే భావనతో ఆరు ప్రత్యేక బ్రాండ్ల ద్వారా సేవలు అందించనుంది. అనారోగ్యం వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడంతోపాటు, ముందుగానే ఆరోగ్యంపై శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ప్రారంభోత్సవం సందర్భంగా కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలను ప్రకటించారు. అలాగే రూ.2,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన కొనుగోళ్లు చేసే వినియోగదారులకు ప్రత్యేక ప్రచార ఆఫర్‌లో భాగంగా ఇద్దరు అదృష్టవంతులకు 'ఐఫోన్ ద్యుయో' గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**వలిగొండ అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పించడంతోపాటు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుల ద్వారా అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదేవిధంగా, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమయ్యేందుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పనోచేయడమే మా ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల అధ్యక్షులు బత్తిని సహదేవగౌడు మాజీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి పట్టణ అధ్యక్షులు పోలేపాక జానకి రాములు, బత్తిని లింగయ్య గౌడ్ మాజీ ఎంపీపీ నూతి రమేష్, పిఎసిఎస్ చైర్మెన్ గరిసేరవి, మార్కెట్ చైర్మన్ బీమా నాయక్,కంచనపల్లి సర్పంచ్లు లో ఫోరం మండల అధ్యక్షులురేసు బుచ్చిరెడ్డి, మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, గోపరాజుపల్లి సర్పంచ్ సలిగం జిపృధ్వి, వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం, కరకంటి అనిత యాదయ్య,లోతుకుంట సర్పంచ్ డాక్టర్ గందు రాములు గుర్నాథ్ పల్లి సర్పంచ్ ఆవుల నరసింహ వెల్వర్తి సర్పంచ్ అనిత నర్సింగ్ యాదవ్, లింగరాజు పల్లి సర్పంచ్ బోడిగె లింగస్వామి, నరసయ్య గూడెం సర్పంచ్ పసల జ్యోతి విజయ్, సుంకిశాల సర్పంచ్ పైల సంధ్యారాణి ఉపేందర్ రెడ్డిఆనంద్, గుర్నాథ్ పల్లి రేషన్ డీలర్ జక్క ప్రభాకర్ కాంగ్రెస్ జిల్లానాయకులు ఎమ్మార్వో సిబ్బంది ఎం డి ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మాజీ సర్పంచ్ సాయన్న కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పరామర్శ..

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఝరి (బి) గ్రామ మాజీ సర్పంచ్ పౌనం సాయన్న కుటుంబ సభ్యులను ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం సాయన్న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఝరి (బి) గ్రామంలోని సాయన్న నివాసానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయన్న కుటుంబ సభ్యులైన రాందాస్, ప్రమోద్, శివాజీ, ప్రకాష్‌లను కలిసి ఓదార్చారు. సాయన్న మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం చెప్పారు. సర్పంచ్‌గా గ్రామానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర భాయి రాజన్న,మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి,మాజీ జెడ్పీటీసీ ఉత్తమ్ భలేరావ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆసం బాబు,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల దేవదాస్,మాజీ ఎంపీటీసీ పోశెట్టి,మౌలాఖాన్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్: ఎడ్ల వెంకట్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 16( ప్రజాక్షేత్రం):**

మన బిఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మన గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రేషన్ డీలర్ ఎడ్ల ఉమా రాణి దర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడానికి మరియు పారదర్శకతను పెంచడానికి ప్రవేశపెట్టిన వినూత్న వ్యవస్థే ఈ స్మార్ట్ రేషన్ కార్డులు అని అన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు అందించి,నాణ్యమైన సన్న బియ్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి కి దక్కుతుందని అన్నారు. కావున ప్రతి ఒక్క లబ్ధిదారు స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సెక్రెటరి,జీపీఓ, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామస్థులు, రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.




# హెగ్డోలిలో మత్తడి పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**పోతంగల్,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం)**



పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మత్తడి పోచమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం నుండి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరము మత్తడి పోచమ్మ తల్లి విగ్రహానికి, పూల మాలలు, నిమ్మకాయల దండలతో సుందరంగా అలంకరించి విగ్రహ ఆవిష్కరణ గావించారు. అమ్మవారి ఎదుట ప్రమిదలతో దీపారాధన చేసి, కొబ్బరికాయలు కొట్టి, పసుపుకుంకుమలతో మహిళలు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అర్చకులు గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

# నేడు పెద్దేముల్‌లో అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- **నేడు, రేపు రెండు రోజులు పాటు పీపీఎల్ సీజన్–7 క్రికెట్ పోటీలు**
- **విజేతలకు 12 ట్రోఫీలు..ఉత్తమ ఆటగాళ్లకు ప్రత్యేక పురస్కారాలు**

**పెద్దేముల్, అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**



యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు క్రికెట్ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో పెద్దేముల్ మండల కేంద్రంలో అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ (పీపీఎల్ సీజన్-7)ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. నేడు రేపు సుమారు రెండు రోజుల పాటు పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర క్రీడా మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే జట్లకు ప్రథమ,ద్వితీయ బహుమతులుగా 12 చొప్పున ట్రోఫీలు అందించనున్నట్లు తెలిపారు.అంతేకాకుండా టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బ్యాట్స్‌మన్, బౌలర్‌లకు ప్రత్యేక ట్రోఫీలు అందజేయనున్నారు. టోర్నమెంట్‌లో అత్యంత విలువైన ఆటగాడిగా నిలిచిన క్రీడాకారుడికి (ఎంవీపీ) ప్రత్యేక ట్రోఫీ అందించనున్నారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయి.ఈ నేపథ్యంలో క్రికెట్ పోటీల ద్వారా యువతకు క్రీడా వేదిక కల్పించడం అభినందనీయమని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు.ఈ క్రికెట్ టోర్నమెంట్ పెద్దేముల్ గ్రామానికి చెందిన క్రికెట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఎన్నికల భద్రతా ఏర్పాట్ల పై క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్

- **ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**
- **పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి**

**కర్నూలు ఎమ్మిగనూరు ,అక్టోబర్ 16( ప్రజాక్షేత్రం)-:**

స్థానిక సంస్థల ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ (ఐపీఎస్ ) శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ముందుగా ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని, అనంతరం బనవాసి సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు వెంకటాపురం, ఆది ఆంధ్ర పాఠశాలలను పరిశీలించారు.

అదేవిధంగా ఎమ్మిగనూరు గ్రామీణ పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట వంటి సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను సందర్శించి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు.



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీనివాస్ , రూరల్ సీఐ చిరంజీవి, ఎమ్మిగనూరు పట్టణ సీఐ కంబగిరి రాముడు, పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి,ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించాలి

- **జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి**

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతోను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పర్యటించిన సందర్భంగా గుర్తించిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో చర్చించారు.

**అయ్యప్ప కాలనీ డ్రైనేజీ పనులు ప్రారంభించాలి**

అయ్యప్ప కాలనీలో డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఆటోనగర్ డంపింగ్ యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, ఫుట్‌పాత్‌లు నిర్మించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని కోరారు.

**వైదేహి నగర్‌లో కొత్త రోడ్లు.. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం**

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్‌లో నూతన రహదారుల నిర్మాణం చేపట్టాలని సుధీర్‌రెడ్డి కోరారు. హరిహరపురం కాలనీ, విజయపురి కాలనీల్లో నూతన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.



చంపాపేట్ డివిజన్ పరిధిలోని పవన్‌పురి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సైతం వెంటనే ప్రారంభించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ వికాస్ మహాతో, ఆయా పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు వివరించారు.

# లక్కీడ్రాలో ఇద్దరికి బార్లు

- **మొయినాబాద్ మున్సిపాలిటీలో రెండు బార్లకు లబ్ధిదారుల ఎంపిక**

**మొయినాబాద్,అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్ల కేటాయింపునకు నిర్వహించిన లక్కీడ్రాలో ఇద్దరు విజేతలను ఎంపిక చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పర్యవేక్షణలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పీవీ కన్వెన్షన్ హాల్‌లో ఎక్సైజ్ శాఖ అధికారులు లక్కీడ్రా నిర్వహించారు. ఇందులో బాకారం జాగీర్‌కు చెందిన ఎల్గని భిక్షపతి గౌడ్, చేవెళ్ల మండలం మల్కాపురం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రెండు బార్లకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించిన అనంతరం లక్కీడ్రా ద్వారా బార్లను కేటాయించారు. మొదటి బార్‌కు ఎల్గని భిక్షపతి గౌడ్, రెండో బార్‌కు రవీందర్‌రెడ్డిని ఎంపిక చేశారు. లక్కీడ్రా ప్రక్రియ పూర్తికావడంతో రెండు బార్లకు సంబంధించిన లబ్ధిదారులు ఖరారయ్యారు. ఇక ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు లైసెన్స్, ఇతర అనుమతుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. బార్ల కేటాయింపు ప్రక్రియను లక్కీడ్రా ద్వారా నిర్వహించడంతో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.




# కల్వకోల్ గ్రామంలో గ్రామపంచాయతీ గ్రామ సభ నిర్వహణ నివేదిక

**మహేశ్వరం అక్టోబర్ 16 (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో గ్రామపంచాయలో గౌరవ సర్పంచ్ శ్రీమతి బక్కని లక్ష్మమ్మ గారి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభకు ప్రత్యేక అధికారిగా పశువైద్యాధికారి డాక్టర్ నరేందర్ గారు పాల్గొని మాట్లాడుతూ, ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చ:

